క్లుప్తంగా

పోరుమామిళ్ల సీఐగా చిరంజీవి


సీఐ చిరంజీవిని కలిసిన ఎస్‌ఐ

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సోమవారం చిరంజీవి బాధ్యతలు చేపట్టారు. ఆయన కర్నూలు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న సురేష్‌రెడ్డిని కడప వీఆర్‌కు పంపారు. ఆరు నెలల క్రితమే సురేష్‌రెడ్డి ఇక్కడకు వచ్చారు. సీఐ చిరంజీవికి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ శోభారాణి

ప్రొద్దుటూరు కల్చరల్ : బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ శోభారాణి తెలిపారు. సోమవారం డీఈఓ ఆదేశాల మేరకు పట్టణంలోని పవర్ హౌస్ రోడ్డు, జంగంపేట ప్రాంతాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ రాజు, ఉపాధ్యాయులు అట్ల నరసింహారెడ్డి, వెంకటసుబ్బయ్య, సుధాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు శిక్షణ

ప్రొద్దుటూరు : ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం ద్వారా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేట్ కోర్సుకు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్య అధికారి డి.నాగార్జున, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీసీహెచ్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాంకేతికతను ఉపయోగించి ఇండస్ట్రీ నిపుణుల ద్వారా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఇచ్చి, అనంతరం ఉపాధి కల్పించడం కార్యక్రమ ఉద్దేశమని వారు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని, మరింత సమాచారం కోసం సెల్‌నంబర్లు 8886297300, 9398348760లకు సంప్రదించాలని కోరారు.

దర్గాను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

మైదుకూరు : మైదుకూరు పట్టణంలో కొత్తకొట్టాలు ప్రాంతంలో ఎంపీ ల్యాడ్స్‌తో నిర్మించిన దర్గాను సోమవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. బద్వేలు రోడ్డులోని కొత్తకొట్టాలులో రూ.5లక్షలతో దర్గాను నిర్మించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు చవితి ఉత్సవ కమిటీలతో సమావేశం

చాపాడు: మండల పరిధిలోని అన్ని గ్రామాలలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేయనున్న వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దారు సుభానీ తెలిపారు. విద్యుత్ శాఖ, అగ్ని మాపక సిబ్బంది, పోలీసులతో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వినాయక ఉత్సవాల నిర్వహణ, నిబంధనలపై దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు వెదురూరులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ఓబులేసు తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

బ్రహ్మంగారిమఠం : మండలంలోని రేకలకుంట పంచాయతీ బాలాజీ నగర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పాల్గొన్నారు. ఆయన కు ఆలయకమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, సింగల్ విండోఅధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ కూన పులి రాజానాయుడు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో కనిపించని బంద్


శివాలయం సెంటర్‌లో టీడీపీ నేతలు వరద రాజులరెడ్డి, సురేష్‌నాయుడు తదితరుల నిరసన


బద్వేలు పట్టణం నెల్లూరు రోడ్డులో తెరుచుకుని ఉన్న దుకాణాలు

ప్రొద్దుటూరు క్రైం : టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంలో ఆ పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్ ప్రభావం ప్రొద్దుటూరులో కనిపించలేదు. సోమవారం ఉదయం నుంచే వాహన రాకపోకలతో పాటు వ్యాపార సముదాయాలు తెరచుకున్నాయి. దుకాణాలను మూసేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చినా వ్యాపారులు పట్టించుకోలేదు. ఎప్పటిలాగే వాణిజ్య సముదాయాలు, ఇతర సంస్థలు పని చేశాయి.

టీడీపీ నాయకుల అరెస్ట్

నిరసన చేస్తున్న పలువురు టీడీపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. శివాలయం సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, సీఎం సురేష్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, ఆసం రఘురామిరెడ్డితో పాటు పలువురు టీడీపీ నేతలు ఆందోళనకు దిగారు. దీంతో వారిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌కు తరలించే క్రమంలో మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అస్వస్థతకు గురయ్యారు. కడప టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు మల్లేల లింగారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వీఎస్ ముక్తియార్‌లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. స్టేషన్లలో ఉన్న టీడీపీ నాయకులను కొంత సేపటి తర్వాత సొంత పూచికత్తుపై ఇళ్లకు పంపించారు. సీఐలు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణయాదవ్, రమణారెడ్డి, యుగంధర్‌లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

బద్వేలులోనూ ప్రభావం నిల్..

బద్వేలు అర్బన్ : స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ సోమవారం ఆ పార్టీ నేతలు ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త బంద్ పిలుపు బద్వేలులో ఏ మాత్రం కనిపించలేదు. రోజూ మాదిరే యథా ప్రకారం వ్యాపార సముదాయాలు తెరుచుకున్నాయి. కొన్ని ప్రైవేటు పాఠశాలలు ముందస్తు జాగ్రత్తగా పాఠశాలలకు సెలవు ప్రకటించాయే తప్ప మిగిలిన పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు రోజూ మాదిరే తెరుచుకున్నాయి. దీంతో టీడీపీ బంద్ పిలుపును ప్రజలు పట్టించుకోలేదని, పట్టణంలో బంద్ ప్రభావం ఏమాత్రం లేదని పలువురు చర్చించుకోవడం కనిపించింది. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి టీడీపీ నాయకులు ర్యాలీ చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలికి వచ్చేసరికి పోలీసులు అడ్డుకుని పలువురు నాయకులను స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

విద్యార్థినులకు స్వామి వివేకానంద పుస్తకాలు పంపిణీ


స్వామి వివేకానంద పుస్తకాలతో విద్యార్థినులు, రామకృష్ణారెడ్డి, హెచ్‌ఎం కాశీప్రసాద్‌రెడ్డి, సిబ్బంది

ప్రొద్దుటూరు : స్థానిక వైవీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులకు సోమవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ సర్వమత మహాసభల్లో స్వామి వివేకానంద చేసిన ప్రసంగానికి 130 ఏళ్లు అయిన సందర్భంగా పాఠశాలలోని 130 మంది విద్యార్థినులకు వివేకానందుని పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. ప్రతి విద్యార్థి స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సమస్యలకు భయడకుండా ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలని స్వామి వివేకానంద తెలిపారని చెప్పారు. పిరికితనం వీడి మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి టి.వెంకట సురేష్, గో సంరక్షణ సమితి అధ్యక్షుడు జి.శివనాగిరెడ్డి, ఉపాధ్యాయులు గంగాధర్ నాయుడు, వెంకటసుబ్బయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు

ప్రొద్దుటూరు : వర్క్ షాప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ ఆచార్య సి.నాగరాజు తెలిపారు. స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్‌షాపులు అన్ని విభాగాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సర్టిఫికెట్ కోర్సులు విద్యార్థులకు భవిష్యత్తులో ఉద్యోగాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మెటలర్జీ అండ్ మెటీరియల్ టెక్నాలజీ ఉపయోగాలను వివరించారు. కన్వీనర్ ఎస్.హరినాథరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు దోహదపడతాయని తెలిపారు. జిందాల్ స్టీల్ ఇండస్ట్రీ డిప్యూటీ మేనేజర్ రవితేజ, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ రీసోర్స్ పర్సన్ డాక్టర్ రమేష్, కళాశాల డీన్ ఆచార్య కేవీ రమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం


అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్‌ఓ దివాకర్


అమరవీరులకు నివాళి అర్పిస్తున్న వెంకటరమణారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : విధి నిర్వహణలో అమరులైన అటవీ అధికారుల త్యాగాలు చిరస్మరణీయమని ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్‌ఓ ఎస్‌వీ దివాకర్ తెలిపారు. పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో సోమవారం అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్‌ఓ ఎస్ వీ దివాకర్, సిబ్బంది అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం సబ్ డీఎఫ్‌ఓ మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడే క్రమంలో దేశవ్యాప్తంగా ఎందరో అటవీ ఉద్యోగులు అమరులయ్యారన్నారు.

దేశంలోనే అరుదైన ఎర్రచందనం మన ప్రాంతంలో అధికంగా ఉందన్నారు. ఈ అటవీ సంపదను అక్రమార్కుల బారి నుంచి కాపాడే క్రమంలో అనేక మంది అటవీ అధికారులు మృతి చెందారని తెలిపారు. అంతేగాక వన్యప్రాణుల చేతిలో కూడా ప్రతి ఏటా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అమర వీరుల త్యా గాలు మరువలేనివని ఆయన తెలిపారు. అమర వీరుల స్ఫూర్తితో మనందరం పని చేయాలని ఆయ న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ రవిచంద్ర, ప్రొద్దుటూరు రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీశాఖ అమరవీరులకు సోమవారం స్థానిక ఫారెస్టు కార్యాలయలంలో రేంజర్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో జాతి సంపద రక్షణలో అసువులు బాసిన అమరవీరులకు నివాళి అర్పించడం మన కర్తవ్యమన్నారు. వారి స్ఫూర్తితో, వారిని మార్గదర్శకంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ శ్రీకృష్ణ, సిబ్బంది రమణయ్య, శ్రీనివాసులు, కిశోర్, బ్రహ్మయ్య, వెంకటేష్, అంజి, సుభాషిణి, డాగ్ స్క్వాడ్ హసన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం నిర్వహించారు. మైలవరం మండలం దొమ్మరనంద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషియల్ ఉపాధ్యాయుడు కె. హరి మధుసూదనరావు ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాలలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో తోటి ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, భారతి దేవి, భాగ్యవతి భాయి, వాసంతి, చరణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం రిలే నిరాహార దీక్షలు


ఎస్సీ వర్గీకరణ దీక్షలకు మద్దతు తెలుపుతున్న సింగరయ్య

జమ్మలమడుగు: పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. సోమవారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నయ్య మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు దాటినా ఇంత వరకు ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం దారుణం అన్నారు. ఈ దీక్షలకు మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

14న డయల్ యువర్ డీఎం

మైదుకూరు : ప్రజా రవాణా సమస్యలపై గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రజా రవాణా సమస్యలను, ఫిర్యాదులను సెల్ నంబర్ 99592 25781కు తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు. అవకాశాన్ని మైదుకూరు డిపో పరిధిలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరు కేసీ కెనాల్ వద్ద ఉన్న శ్రీవరసిద్ధి వినాయక ఆలయ 18వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటల నుంచి శ్రీమహాగణపతి, లక్ష్మీనరసింహస్వామి పూజలు నిర్వహించారు. హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం మంగళహారతి కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటలకు శ్రీమహాగణపతి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నూతన భవనంలో వైద్య సేవలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో నూతనంగా ప్రారంభించిన అర్బన్ హెల్త్ కేంద్రంలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రభుత్వ పట్టణ ఆసుపత్రి వైద్యుడు విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆధునిక వసతులతో ఆసుపత్రిలో రోగులకు అన్ని సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మిగిలిన కేసులపై విచారణ జరపాలి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సంబంధించి మిగిలిన కేసులపై కూడా సత్వరమే విచారణ జరపాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధన్నవాడ మహేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. చంద్రబాబు ఓటుకు నోటు కేసు, అమరావతి భూముల కుంభకోణం లాంటి పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారన్నారు. వాటిపై కూడా విచారణ చేపట్టాలన్నారు.

ఎస్పీని కలిసిన మైనింగ్ డైరెక్టర్

వీరపునాయునిపల్లె : జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సిద్దార్థ కౌశల్‌ను సోమవారం రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

నేడు తొండూరుకు ఎంపీ రాక

తొండూరు : కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి మంగళవారం తొండూరుకు రానున్నట్లు వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబు పాపం పండింది


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : చంద్రబాబు తన పాలన కాలంలో చేసిన దోపిడీకి ఇన్నేళ్ల తర్వాత పాపం పండి న్యాయం గెలిచిందని ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం నూతన ఎర్రగుంట్ల మున్సిపల్ భవనంలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో దోపిడీ చేసి డబ్బును కొల్లగొట్టిన కేసులో కోర్టు బోను ఎక్కారన్నారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబును అరెస్టు చేయడం సమంజసమేనన్నారు. ఈ సమావేశంలో కో-ఆప్షన్ సభ్యుడు డి.సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్ మహమ్మద్‌ఆలీ, 1 ,14వ వార్డుల ఇన్‌చార్జిలు ప్రశాంత్, షాహిద్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి


అధికారులతో సమీక్ష చేస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : అక్టోబర్ 2 నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆడుదాం ఆంధ్రకు సంబంధించి ఆయా సచివాలయాల్లో 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఇప్పటికే వివరాలను నమోదు చేసుకున్నారని, వారి వివరాలను సేకరించి ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని సచివాలయాల పరిధిలో అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే బడిఈడు పిల్లలకు సంబంధించి వంద శాతం సర్వే పూర్తి చేయాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి వలంటీర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటి సర్వే నిర్వహించి అనారోగ్యంగా ఉన్న వారిని గుర్తించాలన్నారు. అనంతరం స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళి, ఈఓపీఆర్డీ హసీనా, ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ చెన్నయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


చాపాడు:పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు


బి.కోడూరు: పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

చాపాడు : గర్భిణులు ప్రతి రోజూ తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడుగురు గర్భిణులకు వైద్య పరీక్షలు, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యులు సూచనలు పాటించాలన్నారు. రక్తహీనత లేకుండా ఆహారం తీసుకోవాలని లేకుంటే కడుపులో బిడ్డ ఎదుగుదలలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు చేయించుకోవాలని, ఇక్కడ అన్ని రకాలైన సౌకర్యాలు ఉన్నాయన్నారు. గర్భిణులు, సిబ్బందికి పల్లవోలు గ్రామానికి చెందిన శ్రీపతి ప్రభాకర్ కుటుంబీకులు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీవాణి, కావ్య మాధురి, ఓబులేసు, సీహెచ్ఓ మహదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, ఆశా నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్ సరస్వతి పాల్గొన్నారు.

బి.కోడూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు తెలిపారు. సోమవారం పీహెచ్‌సీలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 24 మంది గర్భిణులు పాల్గొనగా వారికి బీపీ, షుగర్, ఎత్తు, బరువు, రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రతి గర్భిణీ ఎక్కువగా ఆకుకూరలతో కూడిన ఆహారంతోపాటు పాలు, గుడ్లు బాగా తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని తెలియజేశారు. రక్తహీనత పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముగ్గురు హైరిస్క్ గర్భిణీ స్త్రీలను గుర్తించి వారికి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సు పుష్పాంజలి, ఆరోగ్య పర్యవేక్షకులు జాన్ విలియం, అంగన్‌వాడీ సూపర్ వైజర్ సుగుణ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి


ఎస్.ఓబాయపల్లెలో ఈ క్రాప్ నమోదు పరిశీలిస్తున్న ఏడీఏ రమణారెడ్డి

చాపాడు: రైతులందరూ ఖరీఫ్‌లో సాగు చేసుకున్న ప్రతి ఎకరా పంటను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ రమణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎస్.ఓబాయపల్లె గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు ప్రక్రియను సోమవారం ఏడీఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతాంగం వర్షాభావ పరిస్థితుల వలన సాగు కొంచెం తగ్గిందన్నారు. మండల పరిధిలోని ఇప్పటి వరకూ 1400 ఎకరాలలో వివిధ రకాలైన పంటలు సాగయ్యాయన్నారు. సాగైన పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం చాపాడులోని ఎరువుల దుకాణాలను ఏడీఏ తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాలలో స్టాకు రికార్డులు, ధరల పట్టికలను పరిశీలించారు. నిబంధనల మేరకూ ఎరువుల విక్రయాలు జరగాలని వ్యాపారులు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మ్యాగి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి


రైతులకు విత్తనాలను అందిస్తున్న ఏపీ సీడ్స్ డైరెక్టర్ శేఖర్ బాబు

మైదుకూరు : కేసీ కాలువ ఆయకట్టు రైతులు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సీడ్స్ డైరెక్టర్ శేఖర్ బాబు అన్నారు. సోమవారం మైదుకూరు మండలంలోని కేసీ ఆయకట్టు గ్రామాలైన శివపురం, అన్నలూరు పంచాయతీల్లో సాగు చేయని కేసీ కాలువ ఆయకట్టు పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం శివపురం రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తున్న జొన్నలు, మినుముల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. రైతులకు కావాల్సిన విత్తనాలను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వరరావు, మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు కృష్ణమూర్తి, మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న, శివపురం, అన్నలూరు సర్పంచ్‌లు కొండా భాస్కర్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు ఆకస్మిక తనిఖీ


రాచాయపేటలో ఈ - పంట నమోదును తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : మండలంలోని రాచాయపేట రైతు భరోసా కేంద్రం పరిధిలో ఈ - పంట నమోదును బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ, మండల వ్యవసాయాధికారి అరవింద నాయక్‌లు ఆకస్మిక తనిఖీ చేశారు. గతంలో ఈ - పంట నమోదు చేసిన పత్తిపంటను సర్వే నెంబరు ప్రకారం పరిశీలించారు. పంట రకం, నీటి లభ్యత, వ్యవసాయ విధానం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ - పంట నమోదు ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు రైతులకు వర్తిస్తాయన్నారు. ప్రస్తుతం సాగయ్యే పంటలకు సంబంధించి ఆయా రైతులు వ్యవసాయ సిబ్బంది ద్వారా ఈ - పంట నమోదు చేయించుకోవాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో వివరాలను నమోదు చేస్తున్నామన్నారు. అనంతరం ఆర్బీకేను తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వరికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల పంటలు సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ ఓబయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.